# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www. mhrtv.com

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 326 | పేజీలు : 4 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | సోమవారం 05-08-2024


## గ్రాండ్ వెల్ కం..


న్యూయార్క్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

ఘన స్వాగతం పలికిన ప్రవాసభారతీయులు

పెట్టుబడులే లక్ష్యంగా పది రోజుల పర్యటన

ఎక్స్ లో ఆల్ ది బెస్ట్ తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4




ఎయిర్ పోర్టులో సీఎం రేవంత్ కు స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు



గ్రామాల్లో చెత్తను తొలగించాలి

ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

2

## స్వచ్ఛదనం... పచ్చదనం విజయవంతం చేయాలి





## లోకల్ సమరం

### పంచాయతీ ఎన్నికలపై ప్రధాన పార్టీలది తలోదారి

### వీలైనంత త్వరగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ యోచన

- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విజయాలతో జోష్ లో హస్తం శ్రేణులు
- కులగణన, బీసీ రిజర్వేషన్ల జోలికి వెళ్లొద్దని నిర్ణయం..!
- వలసలతో ఆందోళనలో బీఆర్ఎస్ అధిష్టానం
- కోలుకునే వరకు పెండింగ్ లో పెట్టాలని బీఆర్ఎస్ వ్యూహం
- ఎంపీ ఎన్నికల్లో 8 సీట్లు గెలిచినా ఎటూ తేల్చుకోలేని బీజేపీ
- కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి నిధుల మంజూరులో ఫెయిలయిందన్న విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం):** సీఎం రేవంత్ రెడ్డి ఇంత హడావుడిగా లోకల్ ఎన్నికలు ఎందుకు జరపాలని అనుకుంటున్నారు? ప్రతిపక్షాలను ఇరుకున పెట్టి తాను లబ్ధి పొందేందుకేనా అని అనుకుంటున్నారంతా. ప్రస్తుతం బీఆర్ఎస్ పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. పార్టీలో ఎవరు ఉంటారో ఎవరు వీడతారో అని అగ్ర నేతలు తలలు పట్టుకుంటున్నారు. మరో వైపు కులగణన, బీసీ రిజర్వేషన్ వంటి అంశాల జోలికి వెళ్లకుండా గతంలో మాదిరిగానే ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ సర్కార్ తొందరపడుతుంది. రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభిస్తే అందుకు చాలా సమయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు. అందుకే ఈ సారికి కులగణన, బీసీ రిజర్వేషన్ల ను టచ్ చేయకుండానే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇక బీఆర్ఎస్ కు కనీసం జిల్లా స్థాయి ఇన్ చార్జీలు కూడా దొరకడమే కష్టమైపోతోంది. పార్టీ మారం అని కచ్చితంగా చెప్పిన నేతలే మర్నాడు కండువా మార్చేస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయి నేతలలో తీవ్ర నిరుత్సాహం నెలకొని ఉంది. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్ స్థానిక పోరుకు సంసిద్ధంగా లేదన్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీది మరో చిత్రమైన పరిస్థితి. అసెంబ్లీలో ఎనిమిది, పార్లమెంట్ లో ఎనిమిది సీట్లు అనూహ్యంగా సాధించిన బీజేపీ వచ్చే ఎన్నికల్లో అధికార పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే యోచనలో ఉంది. అయితే, మొన్నటి పార్లమెంట్ బడ్జెట్ తర్వాత తెలంగాణ బీజేపీ మిగతా 2 లో..


## విలేకరులు కావలెను

## ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.



సెల్ : 800 860 9999


## కేటీఆర్ పైనే.. భారమంతా



- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఫాం హౌస్ కు కేసీఆర్
- బాధ్యతంతా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైనే
- ఇటు పార్టీ బాధ్యతలు.. అటు అధికార పక్షం విమర్శలకు వివరణలు
- ఘర్ వాపసీతో నేతలకు తిరిగి ఆహ్వానం
- కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ పై మంత్రుల ఆరోపణలు
- అభివృద్ధిలో పాతబస్తీని నిర్లక్ష్యం చేశారని ఎంఐఎం ఎదురుదాడి

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం):** విపక్షనేత హోదాలో మొదటి సారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. మళ్లీ ఫాంహౌస్ కి వెళ్లిపోయారు. దాంతో అధికారంలో ఉన్నంత కాలం యువరాజులా చెలాయించిన కేటీఆర్ పై ఇప్పుడు పెద్ద భారమే పడినట్టు కనిపిస్తుంది. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణలకు సమాధానం చెప్పుకోవాలి. అటు అధికారపక్షం నేతల విమర్శలకు వివరణలు ఇచ్చుకోవాలి. మరోవైపు పదేళ్ల మిత్రత్వం కొనసాగించిన ఎంఐఎం కూడా ఇప్పుడు బీఆర్ఎస్ పై విరుచుకుపడుతోంది. ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యేలు కారు దిగిపోతుండటంతో సతమతమవుతున్న కేటీఆర్.. ఈ ముప్పేట దాడితో ఒంటరి అయిపోతున్నారు.తెలంగాణలో కాళేశ్వరం కేంద్రంగా డైలాగ్ వార్ కంటిన్యూ అవుతుంది. ఇరు పార్టీల మధ్య వాటర్ వార్ హైవోల్టేజ్ కి చేరుకుంది. మిగతా 2 లో..



## యూపీలో కులం వల

- మరో రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు
- ఇప్పటి నుంచే మొదలైన కులాల సమీకరణలు
- విజయంపై ప్రభావం చూపే వర్గాలపై బీజేపీ,ఎస్పీల నజర్
- ఓబీసీ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రణాళికలు
- పార్లమెంట్ ఎన్నికల్లో షాక్ నుంచి కోలుకోని కమలం
- దూరమైన దళితులను దగ్గర చేసుకునేందుకు వ్యూహం
- అగ్రవర్ణాలనూ ఆకట్టుకోవాలని అఖిలేష్ ప్రయత్నం

2

## అడ్డగోలుగా ఆక్రమణలు

- వరంగల్ లో చెరువులు, నాలాలు కబ్జా
- అక్రమ నిర్మాణాలతో కుంచించుకు పోయిన పరిస్థితి
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు
- రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్న వైనం
- వానలు వస్తే ముంపు ప్రాంత ప్రజల్లో వణుకు



**వరంగల్, ఆగస్టు 4 (ప్రజాస్వరం):** ఆక్రమణలతో కాకతీయులు నిర్మించిన గొలుసు కట్టు చెరువులు తెగిపోయాయి. అక్రమ నిర్మాణాలతో నాలాలు కుంచించుకుపోయాయి. దీంతో వర్షాలు పడిన ప్రతిసారి నగరంలోని కాలనీలు చాలావరకు నీళ్లలో మునుగుతున్నాయి. 2020 తరువాత 2021, 2022, 2023లో కురిసిన వర్షాలకు కూడా నగరంలో వరదలు ముంచెత్తాయి. వరద ముంపునకు కారణమైన ఆక్రమణల విషయంలో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ కొంత హడావుడి చేసి ఆక్రమణలు అరికట్టకుండానే చేతులెత్తేసింది. ముంపు ప్రాంతాల పరిశీలనకు వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్ నయీంనగర్ వద్ద ఇతర పార్టీకి చెందిన ఓ వ్యక్తి స్కూల్ బిల్డింగ్ అడ్డుగా ఉందని అప్పటికప్పుడు మిగతా 2 లో..

## ఆర్టీసీ బలోపేతం

- 1325 కొత్త బస్సులు అందించనున్న ప్రభుత్వం
- ఉచిత రవాణా పథకంతో పెరుగుతున్న ప్రయాణాలు
- సర్వీసులు సరిపోకపోవడంతో పలుచోట్ల ఇబ్బందులు
- కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్తవి...
- మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) :** తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థకు పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మరిన్ని బస్సు సర్వీసులను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం తరువాత కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు ప్రయాణాలు సాగించడం, అదే సమయంలో పురుషులు, విద్యార్థులు, ఇతరులు సాగించే ప్రయాణాలకు అనుగుణంగా బస్సులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల్లో పెరిగిన రద్దీను తట్టుకునేందుకు అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ కొత్త బస్ సర్వీసులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బస్సులు కావాలన్న టీజీఎస్ఆర్టీసీ అభ్యర్థన



మేరకు జూన్ నాటికి 1325 కొత్త బస్సులను దశలవారీగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే వీటిలో ఇప్పటి వరకు ఆర్టీసీకి చేరిన బస్సుల సంఖ్య అతి స్వల్పం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మరోసారి టీజీఎస్ ఆర్టీసీ నూతన బస్ సర్వీసులు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి మేరకు కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం నూతన బస్సు సర్వీసులను అందించేందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని అందించాలని కోరిన 1325 బస్సుల్లో 712 పల్లె వెలుగులు, 400 ఎక్స్ప్రెస్, 75 డీలక్స్, 138 లహరి, రాజధాని బస్సులు ఉన్నట్లు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే కొన్ని బస్సులు అందుబాటులోకి రాగా, మిగిలిన బస్సులు కొద్ది రోజుల్లోనే టీజీఎస్ఆర్టీసీ చేతికి అందం ఉన్నట్లు చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి వినియోగించనున్నారు. గత కొద్ది నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో మిగతా 2 లో..

## జియో, ఎయిర్టెల్ కు టాటా

బీఎస్ఎన్ఎల్ తో వ్యూహాత్మక భాగస్వామ్యం

రూ.15000 కోట్లు పెట్టుబడి పెట్టిన టీసీఎస్

డేటా సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు

గ్రామాల్లో అందుబాటులోకి రానున్న హై స్పీడ్ ఇంటర్నెట్

బీఎస్ఎన్ఎల్ కు కొద్ది రోజులుగా పెరుగుతున్న వినియోగదారులు

త్వరలో 5జీ నెట్ వర్క్ కు అప్ గ్రేడ్




**ముంబై, ఆగస్టు 4:** తక్కువ రీ చార్జీలతో మెరుగైన సేవలు అందించిన టాటా ఇండికామ్ సేవలు మీకు గుర్తున్నాయా?. టాటా ఇప్పుడు టెలికాం రంగంలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఆకస్మిక భాగస్వామ్యం మిగిలిన టెలికాం కంపెనీలపై దాని ప్రభావం, వినియోగదారులకు ప్రయోజనాల గురించి దృష్టి పెట్టింది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ బీఎస్ఎన్ ఎల్ లో రూ. 15,000 కోట్లు పెట్టుబడి పెట్టింది. నాణ్యమైన సేవలు మిగతా 2 లో..

# లోకల్ సమరం




(మొదటి పేజీ తరువాయి)
నేతలు డైలమాలో పడ్డారు. ఎనిమిది మంది ఎంపీలు , ఇద్దరు కేంద్ర స్థాయి మంత్రులు ఉండి కూడా తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు రాబట్టలేకపోయారని ట్రోలింగులు ఎదుర్కొంటున్నారు. ఇదే అంశాన్ని తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి బీజేపీ సర్కార్ పై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో ఇదే అంశాన్ని హైలెట్ చేస్తే బీజేపీపై వ్యతిరేకత పెరుగుతుండొచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సాధ్యమైనంత తొందరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరిపిస్తే కాంగ్రెస్ కు ఎదురే లేదని చెప్పవచ్చు. ఫలితాలను చూపించి అధిష్టానం దృష్టిలో తన సత్తా ఏమిటో నిరూపించుకోవచ్చు. ఇప్పుడిదే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలు తొందరలోనే జరిపించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. బీఆర్ఎస్ విషయాని కొస్తే ఎన్నికలొస్తే ఎలా ముందుకు వెళ్లాలి? జనం అభిమానం ఎలా చూరగొనాలి? ఒకవేళ క్యాడర్ రివర్స్ అయితే పార్టీ పరిస్థితి ఏమిటి? పార్టీ క్యాడర్ లో నూతనోత్సాహం తెప్పించడానికి ఏం చేస్తే బాగుంటుంది అని బీఆర్ఎస్ అగ్రనేతలంతా ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలప్పుడు అధికారంలో ఉన్నది కాబట్టే స్థానిక పోరులో అత్యధిక స్థానాలు రాబట్టగలిగింది బీఆర్ఎస్. ఈ సారి అధికారానికి దూరంగా ఉండటం, పైగా ప్రజలలో విశ్వాసం కోల్పోవడం, పార్లమెంట్ ఫలితాలు మళ్లీ రిపీట్ అవుతాయా అని ఆందోళన పడుతున్నారు. అందుకే ఎలాగైనా బీసీ కులగణన చేయాల్సిందేనని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసి, మరి కొంతకాలం పంచాయతీ ఎన్నికలు జరగకుండా ఆపగలిగితే తాము లబ్ధి పొందవచ్చని గులాబీ అధిష్టానం భావిస్తున్నది. ఇంకా ఏమైనా లొసుగులు ఉంటే అవసరమైతే కోర్టు ద్వారా పంచాయతీ ఎన్నికలు నిలుపుదల చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నది. ఇవన్నీ పట్టించుకోని రేవంత్ సర్కార్ మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలనే కృత నిశ్చయంతో ఉంది. పోరుకు పోతే తమకే నష్టం అని భావిస్తున్న బీఆర్ఎస్ గెలిచే ప్రాంతాల్లో తప్ప తక్కిన చోట్ల పోటీచేయకూడదని భావిస్తున్నట్లు సమాచారం. అయితే రణం.. లేకుంటే శరణం ఇదీ పార్టీ పరిస్థితి అని జనం చర్చించుకుంటున్నారు.

# అడ్డగోలుగా ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)
కూల్చివేయించారు. ఆ తరువాత మిగతా వాటిని లైట్ తీసుకున్నారు. ఇదిలాఉంటే వరంగల్ లో నాలాలు, చెరువు శిఖాల్లో ఇండ్లు కట్టుకున్న దాంట్లో చాలామంది దొంగ కాగితాలు సృష్టించుకున్నారని, వాటిని తొలగించే పరిస్థితి లేదని గత జులైలో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. కొన్నేండ్ల కిందటే కట్టుకుని ఉంటున్న ఇండ్లను తొలగిస్తే కోర్టు పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పుకొచ్చారు. అప్పటికే కొంతమంది కోర్టుకు వెళ్లడం, గత ప్రభుత్వం కూడా లైట్ తీసుకోవడంతో నాలాల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. అక్రమ కట్టడాలు తొలగించలేక కొన్నిచోట్ల అధికారులు ఏకంగా నాలాల విస్తీర్ణాన్నే కుదించేశారు. హనుమకొండలో ప్రధానమైన నయీంనగర్ నాలా ఆక్రమణలతో 40 అడుగులకే పరిమితమైంది. చుట్టుపక్కల చాలాచోట్ల గత పాలకుల దగ్గరి వ్యక్తుల ఇండ్లు, అపార్ట్మెంట్లు ఉన్నాయి. నయీంనగర్ బ్రిడ్జి సమీపంలో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించి బిల్డింగ్ కట్టాడు. 2023 జులైలో వచ్చిన వరదల నేపథ్యంలో నాలా విస్తరణ చర్యలు చేపట్టిన అధికారులు దానిని వంద అడుగులకు విస్తరించాల్సి ఉండగా, నేతల ఒత్తిడితో 82 అడుగులు అంటే 25 మీటర్లకే పరిమితం చేశారు. చాలాచోట్ల బఫర్ జోన్ ఏర్పాటు పేరున కాలువకు ఆనుకుని ఉన్న కాంపౌండ్లను కూల్చిన అధికారులు ఆ తరువాత పట్టించుకోకుండా వదిలేశారు.

వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి, చిన్న వడ్డేపల్లి, కోట చెరువు, రంగసముద్రం(ఉర్సు), బంధం చెరువులు అన్యాక్రాంతం అయ్యాయి. బఫర్ జోన్ లో ఇండ్లు ఉండడం మూలంగా వరద నీరు చెరువులోకి వెళ్లకుండా నగరంలోకి ప్రవేశించి కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు 2010లో హైకోర్టును ఆశ్రయించారు. 14 సంవత్సరాల తర్వాత హైకోర్టు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది. అక్రమ కట్టడాలు తొలగించి చెరువులు కాపాడాలని తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో కదిలిన బల్దియాకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు 1094 అక్రమ కట్టడాలకు నోటీసులు జారీ చేశారు. అనంతరం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 28, 10వ డివిజన్లలో సంతోషి మాత కాలనీ, సాయి నగర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్, జయ కాలేజీ ఎఫ్ టీఎల్, భద్రకాళీ చెరువు బఫర్ జోన్లలో అక్రమంగా కట్టిన 78 కాంపౌండ్లు, 28 రేకుల షెడ్లను తొలగించారు. పేదల ఇండ్లు తొలగించవద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చెరువుల పరిరక్షణకు ఇబ్బంది కలుగకుండా పేదలకు సహాయం చేయాలే తప్ప నగరానికి ఇబ్బంది కలిగే పని చేయవద్దని ముంపు బాధిత ప్రజలు అధికారులను కోరుతున్నారు. బఫర్ జోన్, నాలాలపై అక్రమ కట్టడాలను తొలగించి నగరానికి వరద, ముంపు బాధ లేకుండా చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.
వడ్డేపల్లి నాలా ఇరువైపులా ఆక్రమణకు గురయ్యింది. చిన్నపాటి వర్షానికే హనుమకొండ ముంపునకు గురవుతుంది. చెరువులోకి డ్రైనేజీ వాటర్ రావడం వల్ల నీరు కలుషితం అవుతుంది. వర్షకాలం వరద నీటిలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిసారి నాయకులు మాటలు చెప్పడం, అధికారులు పనులు మొదలు పెట్టడం, ఏదో ఒత్తిడితో పనులు నిలిపి వేయడం ఆనవాయితీగా మారింది.

# కేటీఆర్ పైనే.. భారమంతా

(మొదటి పేజీ తరువాయి)
బీఆర్ఎస్ చలో మేడిగడ్డతో కాళేశ్వరం పంచాయితీ కాక రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మేడిగడ్డ నుంచి రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు నీటి ఎత్తిపోతలను ప్రారంభించాలన్నారు. ఆగస్టు 2 వరకు గడువిస్తున్నామని, స్పందించకుంటే 50 వేల మంది రైతులతో కలిసి మోటార్లను ప్రారంభిస్తామని హెచ్చరించారు కేటీఆర్. కుంగుబాటు వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. రాబోయే రోజుల్లో మేడిగడ్డకు కాంగ్రెస్ తో ప్రమాదం పొంచి ఉందని కామెంట్ చేశారాయన.తమ ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరంపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి ప్రాజెక్టును తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని చెప్పారు. ఇక మరో సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మేడిగడ్డ కుంగినప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ నేనని.. కేటీఆర్ ఆరోపించినట్లు కుట్రలు చేస్తే డ్యామ్ లోపలికి ఎలా కుంగుతుందని ప్రశ్నించారు. అయినా పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రాని ఆ పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని తీసిపారేశారు. కాళేశ్వరం పేరుతో రెండు లక్షల కోట్ల రూపాయలు గంగపాలు చేశారని ఆ డబ్బులతో వేలాది ఇందిరమ్మ ఇండ్లు కట్టేవాళ్లం అని పేర్కొన్నారు. ఆధారాలతో సహా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోలేక బీఆర్ఎస్ సతమతమవుతుంది. ఇప్పుడు ఎంఐఎం కూడా వారికి తోడైంది. బీఆర్ఎస్ హయంలో పాతబస్తీ అభివృద్ధికి నోచుకోలేదని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ విమర్శించారు. వాళ్ల దృష్టి మొత్తం గచ్చిబౌలి వైపే ఉందని మండిపడ్డారు. ఓల్డ్ సిటీలో దుర్భర పరిస్థితులు ఉన్నా పట్టించుకున్న నాదుడే గత పదేళ్లలో లేడని. కేటీఆర్ ను అడిగితే ఇదిగో అదిగో అని కాలం వెళ్లదీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మాటలు అద్భుతంగా చెప్పేవారు కానీ.. పనులు మాత్రం శూన్యమని సెటైర్లు విసిరారు. కాంగ్రెస్ నేతలకే కేటీఆర్ పళ్లబిగువున సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. పవర్ లో ఉన్నప్పుడు పాతబస్తీపై బోలెడు ప్రేమ ఒలకపోసిన ఆయన ఇప్పుడు అక్బర్ ఆరోపణలకు ఏం సమాధానం చెప్తారో చూడాలి. మొత్తానికి బీఆర్ఎస్ ఒంటరి అయిపోయిటన్లే కనిపిస్తోందిప్పుడు.

# ఆర్టీసీ బలోపేతం




(మొదటి పేజీ తరువాయి)
ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం ప్రయాణికులు సంఖ్య అధికంగా ఉండడంతో చాలామంది ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ తరహా ప్రయాణాలు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటికి చెక్ చెప్పేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు.నూతన ఆర్టీసీ బస్సులను అందించాల్సిందిగా ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగర పరిధిలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో బస్సులు కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి వినియోగిస్తున్న బస్సులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటిని పక్కన పెట్టి కొత్త బస్సులను తీసుకువచ్చే ప్రతిపాదనను ఇప్పటికే టీజీఎస్ఆర్టిసి అధికారులు పెట్టారు. ఈ ప్రతిపాదనలను అధికారులు ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో ప్రజా రవాణాలో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక జిల్లాల్లో ప్రజల రవాణాకు కీలకంగా వ్యవహరిస్తున్న పల్లె వెలుగు బస్సులు కూడా కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల డొక్కు బస్సులతోనే ప్రజలకు సేవలను అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులను కూడా టీజీఎస్ఆర్టీసీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నూతన బస్సులను కొద్ది రోజుల్లోనే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. తద్వారా తమ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకానికి మరిన్ని బస్సులను కేటాయించడంతోపాటు పల్లె వెలుగు, ఇతర సేవలకు సంబంధించిన బస్సులను భారీగా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్నీ అనుకూలిస్తే కొద్ది రోజుల్లోనే ఈ బస్సులు ప్రజలకు సేవలు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే జరిగితే రాష్ట్రంలోని ప్రజా రవాణాను వినియోగించే ప్రజలకు ఎంతగానో మేలు చేకూరనుంది. వ్యయ ప్రయాసలకోర్చి సాగించే ప్రయాణాలకు చెక్ చెప్పేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త బస్సులను కొన్నింటిని టీజీఎస్ఆర్టీసీ కి అందించింది. కొద్దిరోజుల కిందట 100 బస్సులను ప్రారంభించిన ప్రభుత్వం.. ఈ ఏడాది మార్చిలో 16 ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టింది. వీటితోపాటు మరికొన్ని బస్సులను కూడా అధికారులు టీజీఎస్ఆర్టీసీకి అందించేందుకు ఏర్పాటు

# యూపీలో కులం వల

**రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు**
**ఇప్పటి నుంచే మొదలైన కుల సమీకరణలు**
**ప్రభావం చూపే వర్గాలపై బీజేపీ, ఎస్పీల నజర్**
**ఎత్తులకు పై ఎత్తులతో రసవత్తరంగా ఉత్తరప్రదేశ్ రాజకీయాలు**

**లక్నో, ఆగస్టు 4:** లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కి ఊహించని దెబ్బకొట్టిన ఉత్తర్ ప్రదేశ్ లో అధికార, విపక్ష కూటమి పార్టీలు మరో రెండేళ్లలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నాయి. జరిగిన నష్టాన్ని పూడ్చుకుని మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందాలని కమలనాథులు భావిస్తుంటే.. లోక్ సభ ఎన్నికల్లో మాదిరిగానే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వివిధ సామాజికవర్గాలను ఆకట్టుకుంటూ కలసికట్టుగా కమలదళాన్ని ఓడించాలని విపక్ష కూటమి పార్టీలు సమాజ్ వాదీ, కాంగ్రెస్ పార్టీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేసే ప్రయత్నాల్లో రెండు కూటములు మునిగి తేలాయి. రాజకీయ చదరంగంలో ఒకరికొకరు 'చెక్ మేట్' పెట్టేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. బీజేపీ విషయానికొస్తే.. యాదవులు మినహా ఇతర ఓబీసీ సామాజికవర్గాలు, అగ్రవర్ణాలు, దళిత వర్గాల్లో కొందరి అండతో వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చిన ఈ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో ఈ మూడు వర్గాలు దెబ్బకొట్టాయి. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని విపక్షాలు చేసిన ప్రచారం ప్రభావంతో దళిత, ఓబీసీ వర్గాల్లో చాలా మంది దూరమవగా, టికెట్ల కేటాయింపులో ఠాకూర్లకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యత దక్కలేదన్న ఆక్రోశానికి తోడు.. తమ వర్గానికే చెందిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను బీజేపీ అగ్రనాయకత్వం దూరం పెడుతోందన్న భావన ఆ వర్గం ఓటర్లలో నెలకొంది. ఫలితంగా వారంతా కలసికట్టుగా బీజేపీకి పూర్తి వ్యతిరేకంగా పనిచేశారు. తమ సంఖ్యాబలం పెద్దగా లేనప్పటికీ, రాష్ట్రంలో భూస్వామ్య సామాజికవర్గమైన ఠాకూర్లు, అనేక ఇతర వర్గాలను ప్రభావితం చేయగలరు. ఈ కారణాలు బీజేపీకి శరాఘాతంగా మారాయి.

దేశంలోనే అత్యధిక లోక్ సభ స్థానాలు (80) ఉన్న ఈ రాష్ట్రంలో కమలదళం గత ఎన్నికలతో పోల్చితే ఏకంగా 9.57 శాతం ఓట్లను కోల్పోయి 43.31% ఓట్లతో కేవలం 36 సీట్లను గెలుపొందగలిగింది. అదే సమయంలో విపక్ష కూటమి 19.05 శాతం ఓట్లను పెంచుకుని 43.52% ఓట్లతో 43 సీట్లను గెలుపొందింది. ఒక్క సీటులో ఈ రెండు కూటముల్లోనూ లేని ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్ గెలుపొందారు. అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల శాతంలో పెద్ద తేడా లేనప్పటికీ బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ దాదాపు 10 శాతం ఓట్లను కోల్పోవడంతో సీట్ల సంఖ్యలో భారీగా కోత పడింది. ఈ ఎన్నికల ఫలితాలపై జాతీయ, రాష్ట్రస్థాయిలో అంతర్మథనం, ఆత్మపరిశీలన చేసుకున్న కమలదళం.. తమకు దూరమైన దళిత, ఓబీసీ వర్గాలను మళ్లీ దగ్గర చేసుకునే ప్రయత్నాలు చేస్తోంది. సమాజ్ వాదీ పార్టీ తన రాజకీయ పునాదిని పిఛ్ డా (వెనుకబడిన తరగతులు), దళిత్, అల్ప సంఖ్యాక్ (మైనారిటీ) వర్గాలకు మాత్రమే పరిమితం చేయకుండా, అగ్రవర్ణాల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. తద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్ర అధికార పీఠంపై పాగా వేయాలని అఖిలేశ్ యాదవ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాతా ప్రసాద్ పాండేను నియమించారు. నిజానికి ఈ బాధ్యతను తమ కుటుంబానికి చెందిన శివపాల్ యాదవ్ లేదా పార్టీలో సీనియర్లుగా ఉన్న ఇంద్రజిత్ సరోజ్, రామ్ అచల్ రాజ్ భర్ తూఫానీ సరోజ్ వంటి ఓబీసీ నేతల్లో ఒకరిని నియమిస్తారని అందరూ భావించారు. కానీ అందరి ఊహలు, అంచనాలను తలకిందులు చేస్తూ అఖిలేశ్ యాదవ్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచిన ఓబీసీల్లో విశ్వాసం కల్గిస్తూ.. దళితవర్గాలను ఆకట్టుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. లోక్ సభ ఎన్నికల తర్వాత యూపీలో పార్టీలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో నియమితులైన వారిలో ఓబీసీ, దళిత వర్గాలకు చెందిన నేతలకు అగ్రభాగం దక్కింది. మోదీ ప్రభుత్వం శనివారం కొత్తగా ఆరుగురు గవర్నర్లను నియమించింది. వారిలో ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇద్దరు నేతలున్నారు. ఒకరు సంతోష్ కుమార్ గంగ్వార్, మరొకరు లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య. సంతోష్ కుమార్ గంగ్వార్ ను జార్ఖండ్ గవర్నర్ గా నియమించగా, లక్ష్మణ్ ఆచార్యను అస్సాం గవర్నర్ గా నియమిస్తూ.. మణిపూర్ గవర్నర్ గా అదనపు బాధ్యతలు అప్పగించింది. గవర్నర్ నియామకానికి ముందు, స్వామి ప్రసాద్ మౌర్య రాజీనామాతో ఖాళీ అయిన శాసన మండలి స్థానానికి మౌర్య సామాజిక వర్గానికి చెందిన బహోరన్ లాల్ మౌర్యను బీజేపీ ఎమ్మెల్సీగా చేసింది. సంతోష్ కుమార్ గంగ్వార్ మరియు బహోరన్ లాల్ మౌర్య ఇద్దరూ ఓబీసీ వర్గాలకు చెందిన నేతలే. ఇకపోతే లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య దళిత వర్గానికి చెందిన నేత. ఓబీసీ ఓట్ల ఆధారంగానే ఉత్తరప్రదేశ్ లో బీజేపీ తన రాజకీయ అజ్ఞాతవాసాన్ని ముగించింది. 2014 నుంచి వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చింది.

2014 ఎన్నికల్లో యాదవేతర OBCలు, జాతవేతర దళితులపై దృష్టి సారించి బలమైన సోషల్ ఇంజనీరింగ్ చేసింది. అప్పటి వరకు ఓబీసీల పేరుతో యాదవులకు మాత్రమే ప్రాధాన్యత దక్కగా, దళిత రాజకీయాల్లో 'జాతవ్' వర్గానికి చెందిన దళితులకు మాత్రమే ప్రాధాన్యత దక్కింది. బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ ఫలితంగా ఈ రెండు వర్గాల్లో మిగతా సామాజికవర్గాలు కమలదళం వెంట నడిచాయి. అయితే 2024 లోక్ సభ ఎన్నికలలో సమాజ్ వాదీ పార్టీ PDA (ఓబీసీ, దళిత, మైనారిటీ) ఫార్ములా కారణంగా బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ ఫలించలేదు. యాదవులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారన్న ముద్రను చెరిపి వేయాలన్న సంకల్పంతో అఖిలేశ్ యాదవ్ తన కుటుంబానికి చెందిన 5 గురు యాదవులకు తప్ప మరెవరికీ టికెట్ ఇవ్వకుండా ఇతర ఓబీసీ వర్గాలకు టికెట్లు కేటాయించారు. ఫలితంగా కుర్మీ, కొయేరీ, నిషాద్ వంటి ఓబీసీ కులాలు ఈసారి సమాజ్ వాదీ పక్షాన నిలిచాయి.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 56 శాతం జనాభా ఉన్న ఓబీసీలు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. అందుకే అన్ని పార్టీలు ఈ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈసారి లోక్ సభ ఎన్నికల్లో ఓబీసీ కులాల ఓటింగ్ సరళిని పరిశీలిస్తే, బీజేపీ, దాని మిత్రపక్షాల ఓట్ల శాతం తగ్గుముఖం పట్టగా, ఎస్పీ, కాంగ్రెస్ కూటమికి లబ్ధి చేకూరింది. ఓబీసీ ఓట్లు జారిపోవడంతో యూపీలో బీజేపీ సీట్లు 2019తో పోలిస్తే 29 సీట్లు తగ్గాయి. ఈ సీట్ల సంఖ్యతో బీజేపీ మెజారిటీకి దూరంగా ఉండి మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. లోక్ సభ ఎన్నికల ఫలితాలు మిగిల్చిన చేదు అనుభవం నుంచి తేరుకున్న కమలదళం 2027 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. తన రాజకీయ సమీకరణాలను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో జరిగే అన్ని నియామకాల్లోనూ ఓబీసీలకే పట్టం కడుతున్నారు. ఓబీసీలను తమకు అనుకూలంగా మలచుకునేందుకు బీజేపీ కింది స్థాయి నుంచి కసరత్తు ప్రారంభించింది. జూలై 29న లక్నోలో బీజేపీ ఓబీసీ విభాగం సమావేశం నిర్వహించింది. ఇందులో సీఎం యోగి ఆదిత్యనాథ్, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. లోక్ సభ ఎన్నికల నాటికి ఏర్పడిన రాజకీయ వాతావరణాన్ని 2027 వరకు కొనసాగించడమే కాకుండా 2024లో వచ్చిన ఓట్ల శాతాన్ని మరింత పెంచుకునేందుకు ఎస్పీ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకుగా భావించే బ్రాహ్మణ వర్గాన్ని తమవైపు తిప్పుకోవడం కోసం మాతా ప్రసాద్ పాండేను శాసనసభా పక్ష నేతగా నియమించింది.

మాతా ప్రసాద్ పాండే యూపీలోని పూర్వాంచల్ ప్రాంతం నుంచి వచ్చారు. ఇక్కడ ఠాకూర్లు, బ్రాహ్మణుల మధ్య రాజకీయంగా ఆధిపత్య పోరు ఉంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఠాకూర్ సామాజికవర్గం నుంచి ఉండడంతో, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాతా ప్రసాద్ పాండేను సమాజ్ వాదీ పార్టీ వ్యూహాత్మకంగా అసెంబ్లీ ప్రతిపక్ష నేతను చేసింది. యూపీలో దాదాపు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు ఉన్నారు. వారిలో వీలైనంత ఓటుబ్యాంకును తమవైపు తిప్పుకోవాలని ఎస్పీ చూస్తోంది. పీడీఏ ఫార్ములా గురించి మాట్లాడుతున్నప్పటికీ, తాము బ్రాహ్మణులకు వ్యతిరేకం కాదని, కీలక పదవులు ఇవ్వడంలో వెనుకాడమని సంకేతమిస్తూ మాతా ప్రసాద్ పాండేను ప్రతిపక్ష నేత పదవికి ఎంపిక చేసింది. దీని వెనుక అఖిలేష్ మరో వ్యూహం ఏంటంటే.. ఎస్పీ ఎమ్మెల్యేలు మనోజ్ పాండే, రాకేష్ పాండే, వినోద్ చతుర్వేది బీజేపీ వైపు మొగ్గు చూపడంతో ఎస్పీలో తమ ప్రాధాన్యత తగ్గుతోందన్న భావన బ్రాహ్మణ వర్గానికి అందింది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో బ్రాహ్మణ సమాజానికి ఓ సందేశం ఇస్తూ తమవైపు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా రెండు పక్షాలు తమ ఓటుబ్యాంకును కాపాడుకుంటూ ప్రత్యర్థి ఓటుబ్యాంకును చీల్చి తమవైపు ఆకట్టుకునే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నాయి.

# జియో, ఎయిర్టెల్‌కు టాటా

(మొదటి పేజీ తరువాయి)
అందించేందుకు డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఈ ప్రధాన పెట్టుబడి నాలుగు కీలక రంగాల్లో పెద్ద వృద్ధిని సాధించగలదని అంచనా వేసింది. ఇది భారీ లాభాలను అందించే అవకాశం ఉంది. బీఎస్ఎన్ఎల్, టాటా మధ్య భాగస్వామ్యం అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే ఇది గ్రామాలకు హై స్పీడ్ ఇంటర్నెట్ ని తీసుకురావడం. ప్లాన్ ప్రకారం.. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే 4జీ సర్వీసులను ప్రారంభించిన 1000 గ్రామాల్లో ఫాస్ట్ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు ఈ గ్రామాలకు కేవలం 3G మాత్రమే అందుబాటులో ఉంది. ఈ భాగస్వామ్యం గురించి టాటా బీఎస్ఎన్ఎల్ ను కొనుగోలు చేసిందని పుకార్లు మొదలయ్యాయి. ఈ పుకార్లు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించాయి. అయితే వాస్తవం ఏమిటంటే, టాటా బీఎస్ ఎన్ఎల్ లో వ్యూహాత్మక పెట్టుబడి మాత్రమే పెట్టింది. దానిని కొనుగోలు చేయలేదు. జూలై ప్రారంభంలో జియో, ఎయిర్ టెల్, వొడాఫోన్ తమ రీ చార్జ్ ప్లాన్ ల ధరలను పెంచాయి. ఇది వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. దీని కారణంగా చాలా మంది తమ నంబర్లను బీఎస్ ఎన్ ఎల్ కి పోర్ట్ చేస్తున్నారు. ప్రతిస్పందనగా బీఎస్ ఎన్ ఎల్ ఇప్పుడు 5G నెట్ వర్క్ లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతోంది. దీని ట్రయల్ త్వరలో ప్రధాన నగరాల్లో ప్రారంభమవుతుంది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో టాటా, బీఎస్ఎన్ఎల్ మధ్య భాగస్వామ్యం మెరుగైన కనెక్టివిటీతో టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తుందని భావిస్తున్నారు.




# డెంగ్యూ పంజా

**❑ ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులు**
**❑ భారీ వర్షాల నేపథ్యంలో విజృంభణ**
**❑ అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సలహా**
**❑ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచన**



**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) :** తెలంగాణలో ఈ ఏడాది భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై డెంగ్యూ ప్రభావం ఉన్నట్లు సమాచారం. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, నిలోఫర్ లో డెంగ్యూ జ్వరాలతో వస్తున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ ఫీవర్ పట్ల నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఐదారు రోజులకు పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ నివేదిక ప్రకారం తెలంగాణలో జులైలోనే 722 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు మొత్తం 1800 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. జనవరి నుంచి జూన్ వరకు 1,078 డెంగ్యూ కేసులు నమోదవ్వగా... జులై చివరి నాటికి ఈ సంఖ్య 1,800కి పెరిగింది. వీటిలో 60 శాతం కేసులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నమోదయ్యాయి. మిగిలిన కేసులు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో రికార్డు అయ్యాయి. అయి తే గత కొన్ని సంవత్స రాలుగా డెంగ్యూ కేసుల్లో తగ్గుదల కనిపిస్తుంది. 2019లో 13,331 కేసు లు, ఏడు మరణాలు రికా ర్డు కాగా, 2020లో 2,1 73 కేసులు, 2021లో 7,135 కేసులు. 2022లో 8,972 కేసులు, 2023లో 8,016 కేసులు, ఒక మరణం నమోదయ్యాయని లెక్కలు చెబుతు న్నాయి. తెలం గాణ వ్యాప్తంగా డెంగ్యూ కేసుల్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే 60 శాతం కేసులు నమో దయ్యాయి. డెంగ్యూ బాధితుల నుంచి ప్లేట్లెట్ కోసం అభ్యర్థనలు పెరుగుతున్నాయని బ్లెడ్ బ్యాంకుల నిర్వాహకులు తెలిపారు. అకస్మాత్తుగా హై ఫీవర్ రావడం, తీవ్రమైన తల నొప్పి, కళ్ల వెను క నొప్పి, కంటి కదలికతో నొప్పి తీవ్రమవు తుండడం, కండరాలు, కీళ్ల నొప్పులు, రుచి, ఆకలి లేకపోవడం, ఛాతీ, శరీరంపై దద్దుర్లు, వికారం, వాంతులు, రక్తపు వాంతులు, ముక్కు, నోరు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, నిద్రలేమి, దాహం అని పించడం, నోరు ఎండిపోవడం, పల్స్ పడిపో వడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిదోమల ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించేందు కు ముందు జాగ్రతలు తీసుకోవాలి. పొత్తికడుపు నొప్పి, వాంతులు, రక్తస్రావం వంటి తీవ్రమైన లక్ష ణాల ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంటి లోపలకు దోమలు రాకుండా దోమ తెరలను ఉపయోగించాలి. బయట ఉన్నప్పుడు పొడ వాటి దుస్తులు ధరించండి. ఇంటి తలుపులు, కిటి కీలు మూసి ఉంచాలి.వర్షాలు పెరిగే అవకాశం ఉందని, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. తలుపులు, కిటికీలకు దోమతెరలు అమర్చు కోవాలని, ఉదయం, సాయంత్రం తలుపులు, కిటి కీలు మూసి ఉంచాలని సూచించింది. సెప్టిక్ ట్యాంకులు కప్పి ఉండాలని, నీటి నిల్వలు లేకుం డా జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపా రు. ఇళ్ల చుట్టూ నిలిచిన నీటిని తొలగించి వారానికోసారి "ఫ్రైడే డ్రై డే" పాటించాలని అధికారులు సూచించారు.

# స్వచ్ఛదనం... పచ్చదనం విజయవంతం చేయాలి : మంత్రి పొన్నం

**హుస్నాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం):** ఈ నెల 5 నుండి 9 వరకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మున్సిపల్ టౌన్ తో పాటు, అన్ని గ్రామాల్లో చెత్తను తొలగించి, మొక్కలు నాటాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, తాగునీరు కలుషితం కాకుండా, మురుగు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు, యువజన స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు భాగస్వామ్యం కావాలని, వన మహోత్సవం ద్వారా ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని పేర్కొన్నారు.




# రైతుగా మారిన కలెక్టర్

## భార్య, పిల్లలతో కలిసి వరినాట్లు వేసిన రాహుల్ రాజ్

మెదక్, ఆగస్టు 04 (ప్రజా స్వరం) :

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రైతుగా మారారు. ఆదివారం సెలవు రోజు కావడంతో తన భార్య, పిల్లలతో కలిసి వరి నాటు వేశారు. నారాయణ అనే రైతు పొలం నారు మడిలో కాసేపు సాగు పనులు చేశారు. నాట్లు వేస్తున్న పొలాలను పరిశీలించి, సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారు మడి నుంచి పంట అమ్మకం వరకు ప్రతి దశలో రైతుకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేసి రైతు లాభదాయక సాగు చేసే దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను పరిశీలించి, సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





## ప్రతి ఒక్కరిని ఆదుకుంటాం

రామాయంపేట. ఆగస్టు 4 (ప్రజా సర్వం) :

నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన మద్ది స్వామికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన 2,50,000 రూపాయల ఎల్‌వోసీని ఎమ్మెల్యే రోహిత్ కాంగ్రెస్ నాయకులు కమ్మరి రమేష్‌తో కలిసి అందజేశారు.

## వికారాబాద్ జిల్లాలో నేడు మంత్రుల పర్యటన

వికారాబాద్ ఆగస్టు 4( ప్రజాస్వరం):

వికారాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు పాల్గొననున్నారు. వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఆలంపల్లి నుండి రాళ్లచిట్టంపల్లి వరకు, వికారాబాద్ నుండి తాండూర్ వరకు, మర్పల్లి నుండి కోట్‌పల్లి వరకు జరిగే రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలక శంకుస్థాపన చేయనున్నారు. అలాగే వికారాబాద్‌లో 4 సూటెడ్ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

**తాండూరు నియోజకవర్గంలో...**

నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే తాండూరు బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమాల్లో కూడా వారు పాల్గొంటారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పర్యటించనున్నారు. తాండూరు పట్టణంలో గొల్ల చెరువు వద్ద బాక్స్ డ్రైన్, చెన్ గెష్ పూర్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌కు శంకుస్థాపన, గ్రీన్ సిటీ సమీపంలో మహబూబ్ నగర్ - చించొల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన, బ్రిడ్జి పనులకు శంకుస్థాపన, అమృత్ 2.0 కింద నీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు తాండూర్ పట్టణంలో నిర్మాణమైన డబుల్ బెడ్ రూం ఇండ్లను మంత్రులు పరిశీలించనున్నారు. అదేవిధంగా తాండూరు మండలం జినుగుర్తిలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం, చంద్రవంచలో కొత్త సబ్ స్టేషన్, పెద్దేముల్ మండలం కందనెల్లి, యాలాల మండలం జుంటుపల్లిలో ఏర్పాటు చేసే సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేయనున్నారు. బషీరాబాద్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం, కరణ్ కోట్ - బషీరాబాద్ డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. స్పీకర్, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

## మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేష్ గౌడ్

మెదక్, ఆగస్టు 04 (ప్రజా స్వరం) :

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం టీఎన్జీవో భవన్‌లో మెదక్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ గౌడ్ మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో ఇళ్ల పట్టాలు జర్నలిస్టులకు పట్టాలు, అసలే రాని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు త్వరలోనే ఇప్పిస్తామన్నారు. ఎప్పటికప్పుడు జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్నామని, ఆయన సానుకూలంగా ఉన్నారన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ భవనానికి మరిన్ని నిధులు కావాల్సి ఉందని, నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానన్నారు. పిల్లికోటల్‌లోని జర్నలిస్టు కాలనీలో అనేక సమస్యలున్నాయని, వాటిలో ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందామన్నారు. నీళ్ల కోసం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా బోర్లు వేసేలా కృషిచేస్తామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యేను ప్రెస్‌క్లబ్ పక్షాన అందరం కలిసి సమస్యలు వివరిద్దామన్నారు. ప్రవేట్ స్కూల్స్‌లో ఫీజు రాయితీ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యం రాయితీపై ఆయా సంఘాలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహచారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రియాజ్, కోశాధికారి సంగమేశ్వర్, నాయకులు



ఫారూఖ్, రాజశేఖర్, గోపాల్‌గౌడ్, సురేందర్ రెడ్డి, రాజాగౌడ్, వికాస్, భువనగిరి చంద్ర శేఖర్, చింతల రమేష్ , రహమద్, లక్ష్మణ్, రామకృష్ణ, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, మువ్వ నవీన్, ఆంజనేయులు, ఫస్సి, కార్తీక్, రఘు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడ్చల్, ఆగస్ట్ 4 (ప్రజా సర్వం) :

ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా ఎంతో మంది పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని మేడ్చల్ మున్సిపల్ యువ నాయకుడు సందీప్‌గౌడ్ అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులు మేడ్చల్ మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన ఉప్పలాంచి వీరేష్‌కు వచ్చిన 10500, సాజిదా బేగంకు 21000 మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన కార్యాలయంలో సందీప్‌గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సందీప్‌గౌడ్ మాట్లాడుతూ ఆపదలో వుండి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు మహేష్ యాదవ్, సంతోష్‌గౌడ్, రేవంత్, సాయిరెడ్డి, బాబు, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## విజృంభిస్తున్న విష జ్వరాలు

వికారాబాద్, ఆగస్టు 4 (ప్రజా స్వరం) :

వికారాబాద్ జిల్లా వికారాబాద్ ప్రభుత్వ బాలికల సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఆదివారం 20 మంది విద్యార్థినులకు విషజ్వరాలు సోకడంతో అధికారులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అలాగే వికారాబాద్ బాలుర హాస్టల్‌లో చాలామంది విద్యార్థులకు జాండీస్ సోకడంతో కలెక్టర్ అధికారులను, డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



రామాయంపేట, ఆగస్టు 4 (ప్రజా సర్వం) :

మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఆర్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాచపల్లి రాజమ్మ మృతి చెందగా వారి కుటుంబానికి ప్రముఖ సంఘ సేవకులు రాజిరెడ్డి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు స్పందించిన రాజిరెడ్డి నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు.

## నేవీ రాడార్ ఏర్పాటును విరమించాలి




వికారాబాద్, ఆగష్టు 4 (ప్రజాస్వరం):

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం ప్రాంతంలో గల ప్రశాంతమైన అడవి ప్రాంతంలో నేవీ రాడార్ ఏర్పాటు వెంటనే నిలిపివేయాలని వికారాబాద్ జిల్లా ఏఐకేఎంఎస్, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ కమిటీల ఆధ్వర్యంలో పూడూరులోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సేవ్ దామగుండం సేవ్ వికారాబాద్ అంటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

వికారాబాద్, ఆగస్టు 4(ప్రజా స్వరం) :

వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్ఐ రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం, 4 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2PM





# గ్రాండ్ వెల్కం..

## న్యూయార్క్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

## ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. శనివారం ప్రారంభమైన ఆయన ప్రయాణం ఆదివారం తెల్లవారుజామున అమెరికా చేరుకున్నారు. న్యూయార్క్ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి బృందానికి ఘన స్వాగతం లభించింది. సీఎం రేవంత్ రెడ్డి 10 రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ఈరోజు న్యూయార్క్ లో ఎన్ ఆర్ ఐలతో రేవంత్ భేటీ కానున్నారు. ఇక్కడి పర్యటన అనంతరం రేవంత్ బృందం దక్షిణ కొరియాకు వెళ్లనుంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడమే లక్ష్యంగా సీఎం రేవంత్ విదేశీ పర్యటన షెడ్యూల్ కొనసాగుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, దక్షిణ కొరియాలోని సియోల్ లలో రేవంత్ బృందం పర్యటించనుంది. ఇవాల్టి నుంచి సుమారు 10 రోజులు విదేశీ పర్యటలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉండనున్నారు.

**పెట్టుబడుల సాధనే లక్ష్యం..**

అమెరికా నుంచి సీఎం సందేశం ఇస్తూ.. 'కీలకమైన న్యూయార్క్ నగరం నుంచే పెట్టుబడుల సాధన పర్యటన ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నాను. ప్రవాస భారతీయులైన ఇక్కడి మన తెలుగు సోదర సోదరీమణులు గుండెల నిండా ప్రేమ, ఆప్యాయతలతో మాకు స్వాగతం పలకడానికి విచ్చేశారు. మనందరినీ ఏకం చేసే ఒక కల.. తెలంగాణను మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవడం' అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.

## ఆల్ ది బెస్ట్ రేవంత్ రెడ్డి..

-కేటీఆర్ ట్వీట్-

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : తెలంగాణకు పెట్టుబడులు తెచ్చేందుకు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు బెస్ట్ విషెస్ చెప్పారు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్. వారికి ఆల్ ది బెస్ట్ చెబుతూ ట్వీట్ చేశారు. ఈసారి పర్యటనలో తెలంగాణకు పెట్టుబడులతో రావాలని అన్నారు. కేసీఆర్ హయంలో గత 10 ఏళ్లలో రాష్ట్రానికి 4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగాల్లో 24 లక్షల ఉద్యోగాలు సృష్టించామని చెప్పారు.


KTR
@KTRBRS · Follow

As a large contingent from the Telangana Government travels to the US and South Korea to attract investments, I want to take a moment to wish @revanth_anumula and @Min_Sridhar_Babu gaaru - "All the Best"

I came across the schedule reported by some media outlets and I'm pleased... Show more

12:04 PM · Aug 4, 2024



## 800 కేజీల గంజాయి స్వాధీనం

### ఒడిశా టూ మహారాష్ట్ర వయా తెలంగాణ..!

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు. ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమీషన్ ఎజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు.

### లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చి..

## బంగారు గొలుసుతో పరారీ

మేడ్చల్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని దుండగుడు వృద్ధురాలు మెడలో నుంచి గొలుసు లాక్కెళ్ళిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని డబిల్ పూర్ గ్రామంలో చుక్కమ్మ అనే వృద్ధురాలు ఇంటికి గుర్తుతెలియని దుండగుడు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయం గమనించి వృద్ధురాలు మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని తన వచ్చిన ద్విచక్ర వాహనంపై పారిపోయాడని బాధితురాలు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.



## శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదం.. ముగ్గురు మృతి

నాగర్ కర్నూల్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : జిల్లాలో శనివారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మత్స్యబొల్లారానికి చెందిన మాచర్ల కిషన్ కన్నయ్య (22) తన ముగ్గురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి కారులో శ్రీశైలం జలాశయం సందర్శనకు వెళ్లారు. ఈ క్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి సమీపంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రున్ని సమీపంలోని నంద్యాల జిల్లా సున్నిపెంట ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఒకరిని కిషన్ కన్నయ్యగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.